19వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 10 జూన్ 2025 పేజీలు : 8

# జిల్లాలో పలువురు సీఐల బదిలీ

◆జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ గా పెరుక కరుణాకర్





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 9 :** జగిత్యాల జిల్లాలో పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల టౌన్ ఇన్స్ పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వేణు గోపాల్‌ను హైద్రాబాద్ ఐజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని,ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పెరుక కరుణాకర్ ను జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్‌గా నియమిస్తూ ఉతర్వులు వెలువడ్డాయి.జగిత్యాల రూరల్ సీఐగా పని చేస్తున్న వై.కృష్ణారెడ్డిని హైద్రాబాద్ ఐజిపికార్యాలయంలో రిపోర్టు చేయాలని , ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న దామెర సుధాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


# మహిళా సాధికారత మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపిస్తాం

◆కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చుతాం

◆అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి

◆సీత' యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** రాష్ట్రంలో మహిళా సాధికారతను మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని, ఇప్పటికే ఆ దిశగా ప్రయాణం మొదలు పెట్టామని వివరించారు. సోమవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ లో 'షీ జాబ్స్' ఆధ్వర్యంలో రూపొందించిన 'సీత(%-% షీ ఈజ్ ది హీరో ఆల్వేస్)' యాప్ ను ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. 'కుటుంబాల్లో తమ హక్కులను మహిళలు స్వేచ్ఛగా వినియోగించుకుని నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతంది. ఆ దిశగా ఇంటి నుంచే మొదటి అడుగు పడాలి. కేంద్ర గణాంకాల శాఖ 'భారత్ లో పురుషులు, మహిళలు - 2024' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణలో కుటుంబ నిర్ణయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 86 శాతం, పట్టణాల్లో 89 శాతం మంది మహిళలు భాగస్వామ్యమవుతున్నారు. ఇవి అంకెలు కావు... మహిళా సాధికారతను సాకారం చేసేందుకు అడుగులు వేస్తున్న తెలంగాణ విజయగాథ ఇది' అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'తెలంగాణ సమాజానికి మహిళలే పునాది.విద్య, ఉపాధి, నాయ కత్వం, నిర్ణయాత్మక స్థానాల్లో ఎలాంటి వివక్ష లేకుండా మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. మేం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న ప్రతి పథకాన్ని మహిళల పేర్లపైనే ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కోటి మంది తెలంగాణ ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతోనే 'ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025'కు శ్రీకారం చుట్టాం.17 రకాల వ్యాపారాలను గుర్తించి వారిని పారిశ్రామిక వేత్తలుగా మారేలా ప్రోత్సహిస్తున్నాం' అని చెప్పారు. 'మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఎస్ హెచ్ జీల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. మహిళల పేర్లపైనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా.. వాటికి వారినే యజమానులుగా మార్చే గొప్ప ప్రయత్నానికి శ్రీకారం చుట్టాం.స్కూల్ యూనిఫాం కుట్టు పనులతో మహిళా సంఘాలకు ఏటా రూ.80 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నాం. తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. 31 జిల్లాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల ప్రారంభానికి చమురు సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం' అని రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం తరపున తీసుకున్న చర్యలను వివరించారు. '16 నెలల్లో 60వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. డీఎస్సీ ప్రకటించి 10వేల మందికి పైగా ఉపాధ్యాయులను నియమించాం.ఏడాది న్నర కాలంలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడు లను తెలంగాణకు తీసుకొచ్చాం. ఫలితంగా ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభించాయి.యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. పదేళ్లలో గాడి తప్పిన విద్యా వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చాలనే సంకల్పంతో రూ.11600 కోట్లతో 58 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాన్ని చేపడుతున్నాం' అని అన్నారు. 'సీత' యాప్ నైపుణ్య మహిళల ఉత్పత్తులకు అంతర్జా తీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందన్నారు.ముఖ్యంగా ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేస్తున్న గ్రామీణ మహిళలకు ఇది గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందన్నారు.కార్యక్రమంలో ప్రముఖ సినీనటి శ్రీలీలా,ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్,పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఝాన్సీ రెడ్డి, షీ జాబ్స్ నిర్వాహకురాలు సీత తదితరులు పాల్గొన్నారు.

## రోళ్లవాగు అటవీ అనుమతుల

# నివేదికను కేంద్రానికి పంపాలి

◆ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటిక్ ఫారెస్టును కోరిన ఎమ్మెల్యే డా. సంజయ్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 9 :** జగిత్యాల నియోజకవర్గంలోని బీర్పూర్ రోళ్లవాగు అటవీ అనుమతుల నివేదికను కేంద్రానికి పంపాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సోమవారం హైద్రాబాద్లో ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటిక్ ఫారెస్టును కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణంలో 800 ఎకరాల అటవీ భూమి ముంపుకు గురవుతుందని,అటవీశాఖకు మరోచోటు అడవుల పెంపకానికి జిల్లా కలెక్టర్ 800 ఎకరాల భూమిని పరిశీలించి అటవీశాఖకు కేటాయించారని తెలిపారు. రోళ్లవాగు అటవీ అనుమతుల విషయమై నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్విందు కలిసి రోళ్లప్రాజెక్టు అటవీ అనుమతుల నివేదికను ఢిల్లీకి పంపిన వెంటనే అనుమతులు మంజూరు అయ్యేలా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్ తో మాట్లాడి అనుమతులు త్వరగా వచ్చేలా తనవంతుగా కృషి చేస్తానని ఎంపి అర్వింద్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# వార్డుల పునర్విభజనను సక్రమంగా చేపట్టాలి

◆అర్బన్ కాలనీని 49,50వ వార్డులుగా ఏర్పాటు చేయాలి

◆మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 9 :** జగిత్యాల మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజనను సక్రమంగా చేపట్టాలని, అర్బన్ కాలనీని 49,50వ వార్డులుగా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందనను కలిసి జగిత్యాల మున్సిపాలిటీ వార్డుల పునర్విభజనపై స్థానిక నాయకులు, మాజీ కౌన్సిలర్లతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని ఇండ్లు లేని నిరుపేదలకు 2003లో 3500 కుటుంబాలకు నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో ఇండ్లను కేటాయించారని, నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీని జగిత్యాల మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ఇటీవలే ప్రభుత్వం గెజిట్ విడుదల చేస్తూ, మరో రెండు వార్డులను ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందన్నారు. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ఉన్న 18 వార్డులను అలాగే ఉంచుతూ మాకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీని 49, 50వ వార్డులకు గుర్తించాల్సి ఉండగా, వార్డుల పునర్విభజనలో నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీని 11వ వార్డుగా గుర్తించడం సరికాదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జగిత్యాల పట్టణంలోని పాత 48 వార్డుల్లోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో ఇండ్లు పొందిన లబ్దిదారుల ఓట్లను జగిత్యాల మున్సిపల్

2లో

## నూతన గ్రామపంచాయతీల ప్రారంభోత్సవం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 09 :** ఎల్లారెడ్డిపేట మండలం సేవాలాల్ తండా బాకుర్పల్లి నూతన గ్రామపంచాయతీ కార్యాలయాలను ఎల్లారెడ్డిపేట ప్రజా ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు.మన గ్రామ పంచాయతీ మన తండాలు నూతన గ్రామ పంచాయతీలను గిరిజన తండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సభేరా బేగం, ఎల్లారెడ్డిపేట సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హారి సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఎంపీడీవో సత్తయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మటి నరసయ్య , మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి

**-జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి), జూన్ 09 :** జూన్ 18 లోపు దివ్యాంగులు ఉపకరణాల కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని దివ్యాంగుల సౌకర్యార్థం సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునీకరించిన ఉపకరణాలతో పాటు సాంప్రదాయకమైన ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో అర్హులైన దివ్యాంగులకు 2025-26 సంవత్సరానికి ఉచితంగా పంపిణీ చేయుటకు తెలంగాణా వికలాంగుల సహకార సంస్థ, హైదరాబాదు వారి ద్వారా అందించుటకు ఆదేశాలు జారీ చేయబడ్డాయని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.పెద్దపల్లి జిల్లాలోని దివ్యాంగులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు https://tsobmms.cgg.gov.in// అనుమ వెబ్ సైట్ నందు జూన్ 18 లోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన దివ్యాంగులకు ఉచితముగా ఉపకరణాలు పంపిణి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వార్డుల పునర్విభజనను సక్రమంగా చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**పరిధిలోని వివిధ వార్డుల నుండి తొలగించి నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలోని ఇంటి నంబర్లపై కొత్తగా ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. జగిత్యాల మున్సిపాలిటీలో ఇటీవలే విలీనం చేసిన నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీని 49,50వ వార్డులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ టి.విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు హన్మాండ్ల జయశ్రీ, గాజుల రాజేందర్, కల్లెపెల్లి దుర్గయ్య, లోపల్లె హరికృష్ణ, నక్క జీవన్, నాయకులు బండ శంకర్, కొత్త మోహన్, జీఆర్ దేశాయి. సిరాజోద్దీన్ మన్సూర్,ముఖేష్ ఖన్నా, నర్సయ్య, నేహాల్, సవాన్, నాగేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు తెలిపిన తొగరి తిరుపతి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సింగల్ విండో డైరెక్టర్ తొగరి తిరుపతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆదివారం మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి హైదరాబాద్ నుండి ఢిల్లీకి వెళ్లే సమయంలో ఆయనను ఏర్పాటులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ వివేక్ వెంకట స్వామికి మంత్రి పదవి రావడం ఆనందకరమని అలాగే కాంగ్రెస్ అధిష్టానానికి తిరుపతి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామితో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని పేర్కొన్నారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఈసారపు శివకుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

# పలు ప్రత్యేకతల సమాహారం దుగ్గిరాల జీవనయానం

**-సేవా నిరతికి ప్రతిరూపం దుగ్గిరాల జీవితం**
**-జూన్ 10..ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వర్ధంతి**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

తమ తాత తండ్రుల నాటినుండి నివాసముంటున్న తమ ఆవాస స్థానాలను వదిలి, కేవలం ఒక వ్యక్తి చెప్పిన మాటలను తూ.చా తప్పకుండా పాటించి ఒక నిరసన తెలియ జేయడం కోసం లక్ష్య సాధన ధ్యేయంగా గ్రామాలనే వదిలి వెళ్ళిన ఉదంతం చరిత్రలో ఎక్కడా జరిగి ఉండదు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఒక అరుదైన స్ఫూర్తిదాయకమైన సంఘటన తెలుగు నేలపై జరిగింది. ఒకరు కాదు ఇద్దరు కాదు, పదులు కాదు వందలు కాదు, రెండు గ్రామాలకు చెందిన పదిహేడు వేల మంది ఆ సంఘటనలో స్వగ్రామాలు వదిలి సరి హద్దులు దాటి బయట సంవత్సర కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ లక్ష్యం కోసం జీవితాలు గడపాలంటే అది సామాన్యమైన విషయం కాదు. అలా వేలాది మంది అభిమానాన్ని చూరగొని వారిని సంఘటితంగా ఒక్కటిగా నిలిపిన ఘనత ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, తెలుగు వాడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య దక్కుతుంది.1919 లో బ్రిటిష్ ప్రభుత్వం చీరాల, పేరాల రెండు గ్రామాలను కలిపి మునిసిపాలిటీగా విలీనం చేసినపుడు, అధిక పన్నులు చెల్లించడానికి వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమానికి గోపాల కృష్ణయ్య నాయకుడు. ఇది స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన గాంధీజీ సందర్శించి అభినందించిన చీరాల పేరాల సమరం సుప్రసిద్ధం, ముఖ్య ఘట్టం.స్వాతంత్ర్య సమర యోధుల్లో ప్రముఖుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య (జూన్ 2, 1889 – జూన్ 10, 1928) ఆయన గొప్ప నాయకుడు,



సాహసికుడు, వక్త, కవి, గాయకుడు. ఆంధ్ర రత్న బిరుదు బిరుదాంకితుడు.కృష్ణా జిల్లా, పెనుగంచిప్రోలు గ్రామంలో 1889 జూన్ 2 న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జన్మించారు. ఆయన పుట్టిన మూడవ రోజునే తల్లి సీతమ్మ, మూడో ఏట తండ్రి కోదండ రామస్వామి మరణించారు. అప్పటినుండి పినతండ్రి, నాయనమ్మల సంరక్షణలో పెరిగారు. కూచిపూడిలోను, గుంటూరులోను ప్రాథమిక విద్య జరిగింది. హైస్కూలులో చదివే సమయంలోనే 'జాతీయ నాట్య మండలి' స్థాపించి సంగీత, నాటక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే చదువుపై అంత శ్రద్ధ చూపక పోవడం చేత మెట్రిక్యులేషనులో తప్పారు. తరువాత బాపట్ల లో చదివి ఉత్తీర్ణుడయ్యారు.నడింపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు అనే ఒక మిత్రుని సాయంతో 1911లో స్కాట్లండు లోని ఎడింబరో విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. చదివారు. తరువాత ఆనంద కుమార స్వామితో కలసి కొంతకాలం పని చేశారు.1916లో తిరిగి భారతదేశం వచ్చిన దుగ్గిరాల, నాటి జాతీయ ఉద్యమానికి కేంద్రంగా వున్న బందరులోని జాతీయ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో నందికేశ్వరుడు రచించిన 'అభినయ దర్పణం' అనే గ్రంథాన్ని The Mirror of Gesture" అన్న పేరుతో సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించారు. ఇది 1917లో 'కేంబ్రిడ్జ్ – హార్వర్డ్ యూనివర్శిటీ ప్రెస్' వారిచే ప్రచురించ బడడం విశేషం.1920లో మహానందిలో జరిగిన ఆంధ్రమహాసభకు అధ్యక్షుడిగా ఒక అంగవస్త్రం, ఒక కండువా, మెడలో రుద్రాక్షమాలతో ప్రత్యక్షమయ్యారు. నాటి నుండి దాదాపుగా ఆయన జీవితం శ్రీరామచంద్రునికే అంకితమన్న రీతిలో సాగింది.1921 లో గుంటూరులో ఒక సభలో "ఆంధ్ర రత్న" అన్న బిరుదుతో ఆయనను సత్కరించారు. 1921లో బెజవాడ కాంగ్రెస్ సమావేశాలను దుగ్గిరాల తయారు చేసిన వెయ్యిమంది ఎర్రని చొక్కా కుంకుమ బొట్టు ధరించిన ఆ రామదండు సేవా దళమే విజయవంతం చేశారు. రామదండు దుగ్గిరాలకు నమ్మిన బంట్లుగా మిగిలారు. ఆయనలోని ప్రతిభకు అలిండియా కాంగ్రెస్ కార్యదర్శి పదవి దక్కింది. ఆ పదవి దక్కించుకున్న అతి పిన్న వయస్కుడు, తొలి ఆంధ్రుడు ఆయనే. జాతీయ కాంగ్రెస్ ఆఫీసును విజయ వాడలో పెట్టించింది దుగ్గిరాల గోపాలకృష్ణయ్యే. కుటిల రాజకీయ నేతల మధ్య ఇముడలేక, 1923 తర్వాత రాజకీయాలు తనకు వద్దని దూరంగా జరిగారు. తాను వ్యక్తిగా కొత్త జీవితానికి శ్రీకారం చుట్టారు. తెలుగు నాట జానపద కళా రూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాల కృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారు. ఆయన ప్రచారం చేసిన జానపద కళారీతులు – తోలు బొమ్మలాట, జముకుల కథ, బుర్రకథ, వీధి నాటకాలు, సాము గరిడీలు, గొల్ల కలాపం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రాలు, వాలకాలు, గోసంగి, గురవయ్యలు, సరదా కథ, కిన్నెర కథ, కొమ్ము బూర, జోడు మద్దెల, పల్లె సుద్దులు, తూర్పు భాగోతం, చుట్టు కాముడు, పిచ్చికుంట్లవాళ్ళ కథ, సాధనా శూరులు, పలనాటి వీర విద్యావంతులు తదితరాలు ఉన్నాయి. 'సాధన' అనే ఇంగ్లీషు పత్రిక, 'రామదండు అనే తెలుగు పత్రికలు నడిపారు.కాంగ్రెస్ వారి అవలక్షణాలను నాడే ఎత్తి చూపిన పత్రికలు అవి. అటువంటి పత్రికలను మూతపడే వరకు ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు శ్రమించారు. వ్యక్తుల్లో ఇంత సంకుచిత భావం, ఈర్ష్యా ద్వేషాలు వుంటాయని దుగ్గిరాల భావించలేదు. అటువంటి నాయకుల మధ్య కలిసి పని చేయటం కన్నా రామభక్తుడిగా శేష జీవితం గడపటం మంచిదను కున్నారు.తన భార్య ఆభరణాలు, వెండికంచం అమ్మిన డబ్బులతో కోదండ రామాలయం, రామలింగే శ్వర ఆలయం నిర్మాణం చేపట్టాలని భావించి పునాదుల వరకు నిర్మించారు. తన యావదాస్తి ఆ దేవాలయాలకే చెందాలని బహిరంగ వీలునామా రాసి ఆంధ్ర పత్రికలో ప్రకటించారు.గుంటూరులో చిన్న ఇంట్లో మకాం మారగా అప్పటికే ఆయనకు క్షయవ్యాధి సోకింది. సొంత ఇంటిలో కన్ను మూయాలన్న కోరికతోనే గుంటూరులో ఊరికి చివరిలో చిన్న ఇల్లు నిర్మించే యత్నం చేశారు. కిటికీలు, తలుపులు కాకుండానే అంత్య కాలం అందులో గడపాలని గృహ ప్రవేశ తంతు ముగించారు. తనకు అన్నింటికీ ఆ రాముడే దిక్కు. అన్నీ రామలీలలే అని చెప్పుకున్నారు దుగ్గిరాల. 28 మే, 1928న గృహప్రవేశం చేసి చుట్టూ వున్న పేదలకు అన్నదానం చేశారు. తన జీవితం అయి పోయిందని ఆయనకు అర్థమై, జూన్ 10న వైద్యుడు చూసి పరవాలేదని చెప్పినా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నమ్మలేదు.ఆ రాత్రి తన మంచం పక్కన ఒక చాప పరచి వుంచమని కోరారు. రాత్రి పదిగంటల వేళ బాగా దగ్గుతూ, తనను మంచంమీద నుండి చాపమీదికి మార్చమన్నారు. అలా చాపమీద పరుండి తన ఇష్ట దైవమైన రాముని స్మరిస్తూ రాత్రి 10.45 సమయంలో ప్రాణం వదిలారు దుగ్గిరాల. ఆంధ్రరత్న బ్రతికింది కేవలం నాలుగు పదుల లోపే అయినా, విలువలతో కూడిన నిస్వార్థ సేవా నిరతికి ప్రతిరూపమైన దుగ్గిరాల జీవితం ఎందరికో ఆదర్శం. జూన్ 10, 1928 లో గోపాలకృష్ణయ్య మరణించారు.

# హాస్య రస ప్రధాన చిత్ర దర్శకుడు ఇ.వి.వి

**-జూన్ 10...ఇ.వి.వి సత్యనారాయణ జయంతి**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

టాలీవుడ్‌లో అత్యంత విజయ వంతమైన దర్శకుడిగా ఇ.వి.వి సత్యనారాయణ నిలిచాడు. ఆయన 80 మరియు 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చాడు. రాఘవేంద్ర రావు సీనియర్ దర్శకునిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందు కున్నాడు ఇ.వి.వి.. రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఇ.వి.వి. చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. అలా 70 కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ హిట్‌లతో కె రాఘవేంద్రరావుకు గట్టి పోటీ ఇచ్చాడు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవాడు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఇ.వి.వి సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వాడట. ఆయన సినిమాల్లో నాన్ స్టాప్ కామెడీ ఉండేది. ఇప్పటికీ ఇ.వి.వి సినిమాలు చూసి ఎంజాయ్ చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే తొలుత ఇ.వి.వి తన మొదటి సినిమా ఇ.వి.వి రాజేంద్ర ప్రసాద్ ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందని%ొ% గోదావరిలో దూకి చావాలని అనుకున్నాడట. ఓ సారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడడం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయాడట. తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు 'ప్రేమఖైదీ' అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి%ొ% అంటూ ఆయన చిన్న కొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది.ఇ.వి.విగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 – జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన దర్శకుడు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హాస్యప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశ పెట్టాడు. రాజేంద్ర ప్రసాద్ తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజను దొంగలు వంటి చిత్రాలు, నరేష్ తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళా పరమైన చిత్రాలు తీశాడు.

# ఒక మార్పు - అభివృద్ధికి మలుపు

**చురకలు ప్రతినిధి,మెట్‌పల్లి ,జూన్ 09 :** 100 రోజుల ప్రణాళికలో భాగంగా మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ పట్టణంలోని 19వ వార్డులో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్త, గురించి ప్రజల అవగాహన చేయడమైనది కమిషనర్ మాట్లాడుతూ మీ ఇంటి నుండి వచ్చే తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి, మున్సిపల్ ఆటోలకు అంది ఇవ్వాలని తెలిపినారు.తడి చెత్తను కంపోస్ట్ సెంటర్‌కు తరలించి ఎరువుగా తయారు చేయటం జరుగుతుందని. పొడి చెత్తను డి.ఆర్.సి.సి,సెంటర్‌కు తరలిస్తామని



తెలపడం జరిగింది.హానికరమైన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించడం జరుగుతుందని తెలిపినారు కావున పట్టణ ప్రజలు తమ ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి,హానికరమైన చెత్తను వేరుచేసి ఇచ్చుటకు ప్రజలందరూ సహకరించాలని కోరడం జరిగింది. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలం దృశ్య ముందస్తుగా సీజనల్ వ్యాధుల గురించి అవగాహన చేయడం జరిగిందని తెలిపినారు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందంగాల ప్లాస్టిక్ వాడరాదని ప్రజలకు అవగాహన చేయడం జరిగిందని తెలిపారు ప్రజలందరూ ఇంటి నుంచి వెలువడే తడి చెత్త ద్వారా హోమ్ కంపోస్టింగ్ తయారు చేయాలని తెలిపినారు ఇట్టి కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ ఎండి నిజాం అశోక్ నరేష్ నరసయ్య పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుమిత్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 9 :** రైతుమిత్ర కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుమిత్ర ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్




మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటి సారిగా జగిత్యాల జిల్లాలో రైతుల సమస్యలను తీర్చడానికి రైతు మిత్ర - ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం 10.30 గంటల నుండి 1.30 వరకు రైతుమిత్ర కార్యక్రమం కొనసాగుతుందని, రైతులకు పంట యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం, పంటల్లో చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, రైతుమిత్ర కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ తిరుపతి, శాస్త్రవేత్తలు రజినికాంత్, శ్రీనివాస్, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారు వద్దకే న్యాయమూర్తి

**చురకలు ప్రతినిధి, మెట్ పల్లి, జూన్ 9 :** పక్షవాతంతో బాధపడుతున్న ఓ మహిళా ఫిర్యాదురాలు కోర్టు హాల్లోకి రాలేని పరిస్థితిని తెలుసుకున్న న్యాయమూర్తి నారం అరుణ్ కుమార్ స్వయంగా ఫిర్యాదురాలి వద్దకు వచ్చి కేసు విచారణ చేపట్టిన సంఘటన జగిత్యాల జిల్లా మెట్ పల్లి కోర్టు ఆవరణలో చోటుచేసుకుంది. ఇబ్రహీం పట్నం మండలం గోదూరు గ్రామానికి చెందిన చల్ల రమక్క ఫిర్యాదుతో అదే గ్రామానికి చెందిన చల్ల మల్లేష్, చల్ల



శంకర్లపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో గతంలో కేసు నమోదైంది. ఈ నెల 14న జరగనున్న లోక్ ఆదాలత్ లో భాగంగా రాజీకేసుల విచారణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫిర్యాదుదారు, నిందితులు కేసును రాజీ చేసుకొని సోమవారం కోర్టుకు హాజరయ్యారు. అయితే ఫిర్యాదురాలు చల్ల రమక్క పక్షవాతంతో బాధపడుతూ కోర్టు హాల్లోకి రాలేని పరిస్థితిని తెలుసుకున్న మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వారం అరుణ కుమార్ ఓపెన్ కోర్టులోని విచారణ కేసులను పక్కన పెట్టి ఫిర్యాదురాలు రమక్క వద్దకు న్యాయమూర్తి అరుణ్ కుమార్ వచ్చి వివరాలు నమోదు చేసుకొని మల్లేష్, శంకర్లపై ఉన్న కేసును కొట్టి వేస్తున్నట్లు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**చురకలు విలేకరి, మెట్ పల్లి, జూన్ 9 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా బిజెపి కార్యకర్తలు చాటాలని బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణ బిజెపి అధ్యక్షుడు బోడ్ల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టణ కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రధాని మోడీ నాయకత్వంలో 11 ఏళ్లుగా వికసిత్ భారత్ లక్ష్యంగా బిజెపి పని చేస్తుందని, ఈనెల 5 నుండి ఆగస్టు 15 వరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల్లో బిజెపి కార్యకర్తలు సత్తా చాటాలని, మెట్పల్లి మండల, మున్సిపల్లో బిజెపి జెండా ఎగురవేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చెట్పల్లి సుఖేందర్ గౌడ్, ఏలేటి నరేందర్‌రెడ్డి, విజయ్, రమేష్ యాదవ్, సత్యనారాయణ, శ్రీకాంత్,



రాజిరెడ్డి, రాజేష్, రూపేష్, రాజ్, హనుమాన్లు, అనిల్, భాస్కర్, జలంధర్, మొగిలి, సాయి, ప్రసాద్, నర్సయ్య, సౌజన్య, దత్తు లక్ష్మీనారాయణ, ఉమేష్, లింగమూర్తి, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన యువకులు



**చురకలు ప్రతినిధి,మెట్‌పల్లి జూన్ 09 :** కోరుట్ల పట్టణంలోని శ్రీ సాయి న్యూ లైఫ్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సుల్తాన అను మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం 2 యూనిట్లు ఒ పాజిటివ్ రక్తం అవసరం అని పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ రక్తదాతల అనుసంధాన కర్త మెట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు - మహమ్మద్ ఖుతుబద్దీన్ పాషా, ఎనుగందుల ఉదయ్ కుమార్ ని సంప్రదించగా మెట్పల్లి పట్టణంలోని ఎం ఎం ఎం సెల్ పాయింట్ యజమాని,సామాజిక సేవకుడు చిట్యాల మహేష్ కి సమాచారం తెలుపగ మహేష్ తనతో పాటు కోరుట్ల పట్టణానికి చెందిన మహేష్ బావ రాచకొండ రాజవేణు కూడా రక్తదానం చేస్తాడని ఇద్దరు కలిసి మెట్పల్లి పట్టణంలోని బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తదానం చెయ్యడం జరిగింది.మహేష్, రాజవేణు అత్యవసర సమయంలో ఒ పాజిటివ్ రక్తం అవసరం అని సోషల్ మీడియాలో సమాచారం వస్తే ఎక్కడికైనా వెళ్లి రక్తం,ప్లేటెల్ దానంచేసి వస్తారు.అత్యవసర సమయంలో రక్తదానాం చేసి ప్రాణధాతగా నిలిచిన చిట్యాల మహేష్ ని మరియు రాచకొండ రాజవేణు ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఖుతుబద్దీన్ పాషా, ఉదయ్ కుమార యువజన సంఘాల సభ్యులు, పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

## మంత్రి అడ్లూరికి అభినందనల వెల్లువ



**చురకలు విలేఖరి,వెల్గటూర్,జూన్ 9 :** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కాంగ్రెస్ రాష్ట్రనాయకులు మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంఅందించి అభినందనలు తెలిపారు.అడ్లూరిని మంత్రి పదవి వరించ్చిందని తెలియగానే ధర్మపురినియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు హుటా హుటిన హైదరాబాద్ కు వెళ్లి తమ ప్రియతమ నాయకుడు మంత్రి అడ్లూరికి పుష్పగుచ్ఛా లు అందజేసిన అభినందనలు తెలిపారు.మంగళవారం మంత్రి గా ప్రమాణ స్వీకారానంతరం ధర్మపురి నియోజక వర్గానికి వస్తుండడంతో పెద్దఎత్తున స్వాగతం పలకడానికి పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గానికి మంచిరోజులు వచ్చాయని అడ్లూరికి మంత్రి పదవి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రి దామోదరను కలిసిన అడ్లూరి

**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 9 :** రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను సోమవారం హైద్రాబాద్లో ఇటీవలే మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర నర్సింహా అడ్లూరి



లక్ష్మణకుమార్ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్ తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

# ఎయిడ్స్‌ను నివారించి సురక్షితంగా జీవిద్దాం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, జూన్ 9 :** హెచ్ఐవి పై అవగాహన పెంచుకొని ఎయిడ్స్ ను నివారించి సురక్షిత జీవితానికి కృషి చేద్దామని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డా.ఏన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోనీ ఆరోగ్య ఉప కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్ సమక్షంలో టిబి,హెచ్ఐవి,హెపటైటిస్ పరీక్షలని ఏఏఎం కేంద్రంలో అనుమానిత రోగులను గుర్తించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి హెచ్ఐవి పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ ప్రజలతో డా.శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవి అనే వైరస్ సోకడానికి ప్రధాన కారణం ఆ వైరస్ సోకిన వారీ సిరంజి,బ్లేడ్,అసురక్షితమైన లైంగిక సంబంధం,అసురక్షితమైన రక్త మార్పిడి అంటూ అనుమానిత లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ఐవి పరీక్షలు చేసుకోవాలని, వారికి హెచ్ఐవి ఉన్నట్లు నిర్ధారణ అయినట్లయితే వారికి ఏఆర్టి సెంటర్లో ద్వారా మందులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు.వైరస్ సోకిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, అలాగే టిబి వ్యాధితో బాధపడుతున్న ప్రతి వ్యక్తి కూడా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో యంఎల్ హెచ్ పి డాక్టర్ కృష్ణవేణి, సూపర్వైజర్స్ అచ్యుతరావు, ప్రభావతి,ఏఎన్ఎం వసంత ,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ హక్కుల కోసం ఎస్టీయు నిరంతరం పోరాటం

**-ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్టీయు కీలకం**

**-ఘనంగా ఎస్టీయు 79 వ ఆవిర్భావ దినోత్సవం**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 9 :** గత 78 ఏళ్లుగా ఉపాధ్యాయ , విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్టీయు కీలక పాత్ర పోషించి, 79 వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చారిత్రకమని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చశంకర్, బైరం హరికిరణ్ లు అన్నారు. సోమవారం స్థానిక విద్యానగర్ లోని ఎస్టీయు భవన్లో జిల్లా అధ్యక్షులు మచ్చ శంకర్ ఆధ్వర్యంలో సంఘ పతాక ఆవిష్కరణ చేసి 79 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మగ్దూం మొయినుద్దీన్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జిల్లాలో ఎస్టీయు సీనియర్ నాయకులు రిటైర్డ్ హెడ్మాస్టర్ కన్నోజు ఈశ్వరయ్య ను శాలువా తో సన్మానించారు.అనంతరం జరిగిన ద్వితీయ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ నిజాం ప్రభుత్వంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడానికి మగ్దూం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో 1947 జూన్ 9 న స్టేట్ టీచర్స్ యూనియన్ ఆవిర్భ వించిందన్నారు.అప్పటినుండి నిరంతరం ఉపాధ్యాయుల హక్కులకోసం పోరాడుతూ మొదటగా పీఆర్సి, డిఏ, పెన్షన్ లను సాధించి పెట్టిన సంఘం ఎస్టీయు అని , ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని, తరగతి కి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా,అలాగే భౌతికశాస్త్రం,ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ లు ప్రతి ఉన్నత పాఠశాల లో ఉండాలని మొదటగా చెప్పి దానిని సాధించిన సంఘం ఎస్టీయు అన్నారు. ఉపాధ్యాయులకు అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించిన ఘనత ఎస్టీయూ దేనన్నారు.ఈ విధంగా ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు సంక్షేమం, పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తూ పేద విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిచే సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ అని, ఎస్టీయూ ముందు తరం నాయకులైన కాళోజీ,ప్రో.జయ శంకర్ , పూర్వ ఎమ్మెల్సీలైన వి పి రాఘవాచారి, వాణి విజయరామారావు, శ్యాం సుందర్, రామమూర్తి అలాగే రాష్ట్ర, జిల్లా పూర్వ అధ్యక్ష కార్యదర్శుల బాటలో నడిచి సంఘ బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర కార్యదర్శులు సీర్నాంచ రవీందర్, పాలెపు శివ రామకృష్ణలు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వ్యవస్థతో నేడు సంఘాలు నిర్వీర్యం అవుతున్నాయని, గత ఎమ్మెల్సీలను ఆదర్శంగా తీసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయ వ్యవస్థను చులకన చేస్తూ ప్రభుత్వ పెద్దలు మాట్లాడడం భావితరానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. ఆర్థికేతర అంశాలైన 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, పెండింగ్ డీఏలను మంజూరు చేసి వెంటనే మంచి పిఆర్సి ప్రకటించాలని, వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, పాఠ్యపుస్తకాల కరికులం మార్చాల్సిన అవసరం ఉందని వారు ద్వితీయ కార్యవర్గ సమావేశంలో సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు బండి శ్రీనివాస్, మేకల ప్రవీణ్, సిరిపురం రాజేష్ , ఊరడి ప్రభాకర్, ఏగ్యారపు వెంకటేష్, గుండెల నరేష్ , విద్యామణి కృష్ణ , గుర్రం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు

# మంజూరు చేయాలని వినతి



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూన్ 9 :** మల్లాపూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఎంపీడీవో శశికుమార్ కు సోమవారం కార్యదర్శులు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీలలో నిధులు లేక పారిశుద్ధంలో భాగంగా చెత్తను సేకరించడానికి ఉపయోగించే ట్రాక్టర్ లో కనీసం డిజిల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

## చెరువు భూమి కబ్జా చేసిన

# వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూన్ 9 :** మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామ పరిధిలోని గల పెద్ద చెరువు భూమిని ఆక్రమించుకొని నిర్మాణ పనులు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ రమేష్ కు గంగపుత్ర సంఘ సభ్యులు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ ను మండల కేంద్రంలోని ఆయన కార్యాలయం కలిసి సమస్యను వివరించి సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారిచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు తదితరులున్నారు.

## రైతుమిత్ర కార్యక్రమం ప్రారంభం



**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, జూస్ 9 :** మెట్ పల్లి పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతు మిత్ర ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమాన్ని ఏడిఏ రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు మిత్ర ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి 1.30 వరకు నిర్వహిస్తామని,ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండి పంటల యాజమాన్యంలో పాటించాల్సిన మెళుకువలు, చీడ పీడలు, వర్షకాలంలో ఎంపిక చేసుకోవాల్సిన విత్తనాలపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోన్యానాయక్, స్వాతి, వ్యవసాయాధికారులు దీపిక, లావణ్య,యోగిత, రాజకుమార్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## మొగిలిపేటలో భూ భారతి సదస్సు



**చురకలు విలేకరి,మల్లాపూర్, జూన్ 9 :** మండలంలోని మొగిలిపేట గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి సదస్సులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు భూ భారతి సదస్సులను సందర్శించి, భూ భారతి సదస్సును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

## బిల్లులు ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతి



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూన్ 9 :** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులిప్పించమని కోరుతూ తహసీల్దార్ గుగ్గిల రమేష్ సోమవారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు మౌళిక వసతులకు కోసం చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే మండల వ్యాప్తం ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబందించిన బిల్లులను వెంటనే మంజూరు చేయించాలని వారిచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

### ముస్లిం విద్యార్థులను మైనార్టీ రెసిడెన్స్

# హాస్టల్ పాఠశాలలో చేర్పించండి

-తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తల్లి,తండ్రులకు విజ్ఞప్తి



**చురకలు విలేఖరి,హుజురాబాద్, జూన్, 09 :** రాష్ట్రంలో 2016 సంవత్సరంలో 204 మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఈ మైనార్టీ రెసిడెన్స్ పాఠశాలలో ముస్లిం విద్యార్థులకు మరియు బాలికల కొరకు వేరు వేరు పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క పాఠశాలలలో ముస్లిం విద్యార్థి బాలికలు ఎవరైనా అడ్మిషన్ తీసుకోవాలంటే 5వ తరగతి వరకు చదివి ఉండాలి ఐదో తరగతి నుండి ఇంటర్ మీడియట్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితముగా చదివిస్తుంది ఒక విద్యార్థి సంవత్సరం ఖర్చు లక్ష ఇరవై వేల రూపాయలు ఒక్కొక్క విద్యార్థికి సంవత్సరానికి ఖర్చు పెట్టుకుంటూ చదివిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం కనుక ఈ మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలలలో అన్ని సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది ఉచితముగా భోజనం బట్టలు పుస్తకాలు నివాసం ఉండడానికి మంచి వాతావరణం ఉన్న బిల్డింగ్లలో ఉంచుతున్నారు మరియు ముస్లిం విద్యార్థుల కొరకు ప్రతిరోజు ఉదయం ఐదున్నర గంటలకు ఖురాన్ నమాజ్ సూరే మరియు కల్మే చదివించటం జరుగుతుంది దీనిలో ఇంగ్లీష్ మీడియం మైనార్టీ రెసిడెన్స్ పాఠశాలలో కొన్ని వేలాదిమంది చదువుతూ ఇంజనీర్లు డాక్టర్లు గ్రూప్ వన్ గ్రూప్ టు అధికారులు కూడా అవ్వడానికి మంచి అవకాశం ముస్లిం విద్యార్థి మరియు బాలికలకు మంచి అవకాశం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది కనుక ముస్లిం తల్లిదండ్రులు మీ యొక్క పిల్లలను మీరు వెంటనే మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలలో చేర్పించి ముస్లిం విద్యార్థుల భవిష్యత్తును చక్కదిద్దవలసిన బాధ్యత అతి తల్లిదండ్రులపై ఉందని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ముస్లిం తల్లితండ్రులకు విజ్ఞప్తి చేశారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలలలో ముస్లిం విద్యార్థులను వెంటనే చేర్పించండి వారి యొక్క భవిష్యత్తును చక్కదిద్దవలసిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉంటుందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ వారిని విజ్ఞప్తి చేశారు ఒక్కొక్క విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష 20000 రూపాయలు ఒక విద్యార్థిపై ప్రతి సంవత్సరం ఖర్చు పెడుతుంది కనుక మీ పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలల్లో కల్పించినారు కనుక ఈ యొక్క విద్యార్థులను వెంటనే మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తు చక్కదిద్దవలసిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు ముస్లిం విద్యార్థి మరియు బాలికల చదివించడానికి ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వేలాది రూపాయలు ఫీజులు కట్టి ఇబ్బందులు పడకండి అటు నుండి ఇటు నుండి అప్పులు తీసుకొని వచ్చి మీ పిల్లల చదువుల కొరకు ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు ఫీజులు కట్టి మానసికంగా ఇబ్బందులకు గురికాకండి దయచేసి ఒక్కసారి ఆలోచించండి ముస్లిం విద్యార్థి మరియు బాలికల కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 204 మైనార్టీ రెసిడెన్స్ హాస్టల్ పాఠశాలలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి కనుక మీరందరూ ఈ పాఠశాలలో మీ పిల్లలను ఉచితగంగా చేర్పించండి వాళ్ళు చాలా మంచి చదివి వాళ్ళ భవిష్యత్తు చాలా బాగవుతుందని కనుక వెంటనే ఈ మంచి అవకాశాన్ని ప్రతి ముస్లిం సోదరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మొహమ్మద్ ముజాహి ద్ హుస్సేన్ తల్లితండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో చేరండి...

-ఉచిత పుస్తకాలు యూనిఫాంలు అందుకోండి
-ఎంఈఓ ఏదులాపురం విజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** ప్రభుత్వ పాఠశాలలో చేరి ప్రభుత్వ అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు యూనిఫారాలు నోటుబుక్కులు అందు కోవాలి అని కమాన్ పూర్ ఎంఈఓ ఏదులాపురం విజయ్ కుమార్ అన్నారు. సోమవారం బడిబాటలో భాగంగా కమాన్ పూర్ లో గ్రామసభ నిర్వ హించడం జరిగింది.అనంతరము గ్రామంలోకి వెళ్లి ఎస్సీకాలనీ, ఇస్లాం పుర,శ్రీపాదచౌక్,బస్టాండ్ ఏరియా మొదలగు ప్రాంతాలు ఇల్లిల్లు తిరిగి... 15 అడ్మిషన్లు నూతనముగా చేపించడం జరిగింది. ఈ సందర్భంగా ఏమీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉచిత నోటుబుక్కులు టెక్స్ట్ బుక్కులు బూట్లు అందజేయడం జరుగుతుందని అలాగే మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ కంప్యూటర్ వ్యాధులతో పాటు లైబ్రరీ మ్యాస్ ల్యాబ్ క్రీడా సామాగ్రి తో పాటు విద్యార్థిని విద్యార్థులకు కరాటే యోగలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని స్పష్టం స్పోకెన్ ఇంగ్లీష్ కు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన ఆరో తరగతి విద్యార్థులకు ఐఐటి నీట్ ఫౌండేషన్ డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రాజేశ్వరరావు,సతీష్, రమేష్, మల్లేశ్వరరావు, నంబయ్య, నఫీజ్ పాష, భరత్ కుమార్, శంకర్, ఈశ్వరయ్య, ఎండి ఖలీక్, రజనీవందన, రేణుక... మొదలగువారు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

-సింగల్ విండో చైర్మన్ భాస్కరరావు




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :**
తమ భూముల్లో అవకతవకలు సమస్యలు ఉంటే భూభారతిని సద్వినియోగం చేసుకోవాలి అని వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఇనగంటి భాస్కరరావు అన్నారు. సోమవారం కమాన్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో భూభారతి సభ కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మొత్తం 17 భూ సమస్యలపై దరఖాస్తులు అందినట్లు తహసిల్దార్ వాసంతి తెలిపారు. ఈ సందర్భంగా ఇనగంటి భాస్కరరావు మాట్లాడుతూ ధరణి స్థానంలో తెలంగాణ ప్రభుత్వం భూభారతి ప్రవేశపెట్టిందని దానికి అనుగుణంగానే దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న భూముల సమస్యను భూభారతి ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గిదవార్ స్రవంతి సీనియర్ అసిస్టెంట్ సతీష్ ఏఎస్ఐ ఖలీల్ ఖాన్ పిసి జంగిలి రమేష్ జూనియర్ అసిస్టెంట్ గోస్కుల రజిత, శ్రీనివాస్ ,రంజిత్, రాజేందర్, రికార్డర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ,కట్ట కుమార్, ధరణి ఆపరేటర్ ప్రదీప్, మీసేవ ఆపరేటర్ తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ జెడి






**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** అజీమ్ పదవీ విరమణ కార్యక్రమంలో రిటైర్డ్ పశు సంహర్తకశాఖ జాయింట్ డైరెక్టర్ మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.గౌతమి నగర్ లోని బ్లాంకెట్ హాల్లో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో పనిచేసి ఇటీవలే పదవి విరమణ పొందిన అజీమ్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులతో పాటు చిన్ననాటి స్నేహితులు ఆర్టీసీ తోటి ఉద్యోగులు పాల్గొన్నారు. సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. ఆయన పదవి విరమణ వేడుకలు ఆనందో చాలా మధ్య తన కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నారు. వేడుకల్లో సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్, అబ్దుల్ ఖాదర్, ఇది యాజ్ అలీ రియాజ్ పర్వేజ్ అబ్దుల్లా ఎం ఏ అజీజ్, అనీస్ ,సమద్, అన్వర్, ఫర్దీన్ ,ఇస్మాయిల్, ఆధార్, సర్వర్ ఖాన్, షాబాద్ ఖాన్, ఇజా ఖాన్, వెంకన్న ,నాగేందర్, బెంజమిన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన బడిబాట




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 9 :** కమాన్ పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని రాజాపూర్ జూలపల్లి గ్రామాల్లో మడిబాట నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుండి బడిబాట గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్ , ఉపాధ్యాయులు ఆశ వర్కర్లు పాల్గొన్నారు. అలాగే గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ గ్రామంలో బడిబాడ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల ప్రత్యేక అధికారి ఎంపీడీవో గంగాల లలిత మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ప్రధాన ఉపాధ్యాయులు రాజమౌళి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు, ఎన్నో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బచ్చుల ప్రసాద్, ఉపాధ్యాయులు రాజు , ఉమామహేశ్వరి తన్వీర్ సుల్తానా మమత సంతోష్ మునేష్ కరోబార్ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసు నమోదు

**చురకలు ప్రతినిది ఎల్లారెడ్డి పేట జూన్ 09 :** ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి చెందిన కందాల మంజుల, భర్త లక్ష్మణాచారి ఇచ్చిన దరఖాస్తు ఏమనగా తాము గత కొన్ని రోజుల నుండి హైదరాబాదులో ఉంటున్నందున ఇంటికి తాళం వేసి వాటిని ఎల్లారెడ్డిపేటకు చెందిన మద్దుల శ్రీపాల్ రెడ్డి గారికి ఇచ్చి హైదరాబాద్ వెళ్లి వస్తుంటామని, తేదీ 3.06.2025 రోజున శ్రీపాల్ రెడ్డి నాకు ఫోన్ చేసి మా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని తెలుపగా నేను తెల్లవారి వచ్చి చూడగా మా ఇంటి అల్మారం పగలగొట్టబడి అందులో దేవతలకు సంబంధించిన అమ్మవారి వడ్డానం కిరీటాలు పుస్తెలు ముక్కుపుల్లలు బంగారువి కనిపించలేదని మరియు వెండి కి సంబంధించిన మంగళహారతి కుంకుమ భరణి మాణిక్యాలు కూడా కనిపించలేదని, వీటిని ఎవరో గుర్తు తెలియని దొంగలు పై బంగారు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినారని దరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం అయినదని ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్ రమాకాంత్ గారు తెలిపినారు.

### రోస్టర్ రికార్డులను పరిశీలించిన

# ఎస్టి ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పని చేస్తున్న ఎస్.టి. ఉద్యోగులకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్ లైజన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య పరిశీలించారు. సింగరేణి అన్ని ఏరియాల వ్యాప్తంగా చేస్తున్న రోస్టర్ రికార్డుల పరిశీలనలో భాగంగా సోమవారం జి.యం. కార్యాలయం నందు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పనిచేస్తున్న ఎస్.సి.డబ్ల్యు.ఏ.ఉద్యోగుల ఏరియా స్థాయి అంతర్గత నియామకాలు, పదోన్నతులలో షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ నియమాల అమలుకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్




లైజన్ ఆఫీసర్ వీసం క్రిష్ణయ్య,కమిటీ సభ్యులు ఎ.భాస్కర్‌రావు, బి.నాగేశ్వర రావు పరిశీలించారు. అనంతరం ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో ఉన్నటువంటి ఖాళీలకు అనుగుణంగా చేపట్టిన నియామకాలు,పదోన్నతుల వివరాలను పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం వారికి అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకనుగుణంగా ఏరియాలో అమలు చేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సివిల్ విభాగం ద్వారా నిర్వహిస్తున్న వివిధ కాంట్రాక్టులలో ఎస్.టి. రిజర్వేషన్ అమలును పరిశీలించారు.షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ నిష్పత్తి ప్రకారం వివిధ గనులు, విభాగాలలో ఉన్న ఖాళీలు నింపడానికి సరిపడా ఉద్యోగులు లేనందున,షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులకు ఏరియాలో ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీల వివరాలు, అర్హత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని ఏరియా సింగరేణి షెడ్యూల్డ్ తెగల ఉద్యోగుల సంఘం ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటు జియంలు యం.రామ్మోహన్, బి.వి.సత్య నారాయణ. ఏరియా లైజన్ ఆఫీసర్ ఎల్.వినాయక్,ఏరియా ఎస్.టి. ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బి.హనుమండ్లు,ఎం.జగన్నాయక్ , విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, బి.రాజేంద్ర కుమార్, అధికారులు గుర్రం శ్రీహరి, పి.రాజేశం, ఆఫీస్ సూపరింటెండెంట్ టి.వి.సురేష్ బాబు, శ్రావణి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశవాణి శ్రోత వెంకటేశ్‌కు సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 9 :** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన ఆకాశవాణి శ్రోత గట్ల వెంకటేష్ ను హైదరాబాద్ పట్టణంలో ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్లోని నాంపల్లి లో గల డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిర్ లో అడవి రాజబాబు అభినందన సభలో తెలుగు రాష్ట్రాల సోదాలు పాల్గొన్నారు. అడవి రాజబాబు గత 33 సంవత్సరాల పాటు ఆకాశవాణిలో పనిచేసి పలువురి మనలను పొందారు. ఆయన పిలుపుతో వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆకాశవాణి శ్రోతలు పాల్గొనగా వారికి అడవి రాజబాబు శాలువా కప్పి  పుస్తకాలను అందజేశారు. అలాగే ఆకాశవాణి శ్రోత గట్ల వెంకటేష్ నిత్యం రేడియో ప్రసారాలను వినడం ఆయన అలవాటు.దీంతో ఆయనకు హైదరాబాద్లో ఘనంగా సన్మానం జరిగింది.

## మంత్రి అడ్లూరిని కలిసిన ఉపాధ్యాయులు



**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 9 :** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను సోమవారం ధర్మపురి ఉపాధ్యాయులు గజభీంకార్ గోవర్ధన్, మ్యాన పవన్ కుమార్, మెరుగు రమేశ్, బండారి సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రి అడ్లూరికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రి అడ్లూరిని కలిసిన సుజిత్ రావు



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, జూన్ 9 :** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను సోమవారం టీపీసీసీ డెలిగెట్ కల్వకుంట్ల సుజిత్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుజిత్ రావు మంత్రి అడ్లూరికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత..



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 9 :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని విట్టల్ నగర్ లోని అమ్మ పరివార్ ఆశ్రమానికి, అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించే నిత్య అన్నదాన సేవా కార్యక్రమాలకు మద్దతుగా, ప్రస్తుత యు.ఎస్ వాస్తవ్యులు, అన్నదమ్ములు, హజార్ సయ్యద్, ఉదయ్ రాగిరెడ్డి, ముజాఫిర్ సయ్యద్  కలిసి వారి యొక్క గొప్ప మనసుతో 10వేల విలువ గల నిత్యావసర సరుకులను, అమ్మ పరివార్ దాత మీసాల సతీష్ కుమార్,మరియు మీసాల కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులు నాగరాజుకి అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు నాగరాజు మాట్లాడుతూ, అమ్మ పరివార్ చేస్తున్న సేవలకు వారి యొక్క తోడ్పాటు లభించడం సంతోషదాయకమని, ఇదేవిధంగా వారి యొక్క సహాయ సహకారాలు,అమ్మపరివార్‌కి ఎల్లవేళలా అందాలని వారికి భగవంతుని ఆశీస్సులు ఉండాలని వారు ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరం



**చురకలు విలేకరి, కొడిమ్యాల, జూన్ 9 :** పేదప్రజల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మాల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమి పూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం ఎన్నికల లబ్ధికోసం రెండు పడకల ఇండ్ల మంజూరు పత్రాలను ఇచ్చి నిర్మాణలను తుంగలో త్రొక్కిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కళ్ళలో వెలుగులు పంచడానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. మండలానికి 444 ఇండ్లు కేటాయించినందుకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేశారు. లబ్ధిదారులు త్వరతగతిన నిర్మాణలు పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాశం కిషన్ రెడ్డి, నేరెళ్ల అరుణ మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ రెడ్డి, జంగ మల్లేశం,లింగాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు మిత్ర కార్యక్రమాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి



**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 9 :** రైతు మిత్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడిఏ రాంచందర్ అన్నారు.ధర్మపురి మండల కేంద్రంలోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం లో సోమవారం ఏడిఏ రాంచందర్ రైతు మిత్ర - ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడిఏ రాంచందర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు వ్యవసాయంలో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు,అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని , రైతులకు పంటల సాగులో ఎటువంటి సమస్యలు ఉన్న, సాగులో మెళకువల గురించి నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చున్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొలస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బలరాం, రవి,ధర్మపురి మండల వ్యవసాయా ధికారి రాజ్ కుమార్, ఎఈఒలు సమత, అజయ్, నవ్య, మండల రైతులు పాల్గొన్నారు.

## గుడికందుల భూమయ్యకు స్ఫూర్తి పురస్కారం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవం ఈ నెల 10వ తేదీ మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చేతుల మీదుగా ప్రముఖ న్యాయవాది గుడికందుల భూమయ్యకు స్ఫూర్తి పురస్కారం అందజేయనున్నారు.. గత 16 సంవత్సరాల నుండి న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ పేదవారికి తన వంతుగా సహాయం చేస్తూ సామాజిక కార్యక్రమాల్లో గత 30సంవత్సరాల నుంచి నిర్విరామంగా పనిచేస్తున్న గుడికందుల భూమయ్యను వసుంధర విజ్ఞాన వికాసం మండల జ్యూరీ కమిటీ గుర్తించి అభినందిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగింది.. న్యాయవాది గుడికందుల భూమయ్య ఎంపిక పట్ల పలువురు న్యాయవాదులు.. స్వచ్ఛంద సంఘాలు అభిమానులు శ్రేయోభిలాషులు సంతోషం వ్యక్తపరిచారు.

# ప్రజల అవసరాల నిమిత్తం పోలీస్ స్టేషన్

**-22 సంవత్సరాల కల 13న సాకారం**
**-గతంలో ఇదే పోలీస్ స్టేషన్ మంజూరు కోసం ప్రతిపక్షంలో దీక్షా చేశాం**
**-హామీ ఇచ్చిన విధంగా ఎలిగేడు పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేశాం**
**-పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** ఇచ్చిన మాట ప్రకారం ఎలిగాడు మండలంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసి ఈనెల 13న మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. సోమవారం ఎలిగేడు మండల పోలీస్ స్టేషన్ ను ఈ నెల 13న ప్రారంభిస్తున్న సందర్భంగా స్థానిక ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు ప్రవీణ్, సుబ్బా రెడ్డి, ట్రాఫిక్ సిఐ మరియు ఎస్ఐ లతో కలిసి పోలీస్ స్టేషన్ ను పెద్దపల్లి శాసనసభ్యులు .చింతకుంట విజయరమణ రావు సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...ఎలిగేడు మండలం ఏర్పడి 22 సంవత్సరాలు గడుస్తున్న స్థానిక ప్రజల అవసరాలకు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని దృష్టిలో పెట్టుకొని ఈనెల 13న జిల్లా మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్ యంత్రాంగంతో పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్, మహిళ పోలీస్ స్టేషన్లను సైతం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలిగేడు మండల ప్రజలు వివిధ సమస్యల నిమిత్తం జూలపల్లి పోలీస్ స్టేషన్ కు తరలి వెళ్లేవారు అని ఈనెల 13 తో వారి సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న అప్పటి బీ.ఆర్.ఎస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేశారని ప్రస్తుతం తాము నాలుగు పోలీస్ స్టేషన్లను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 468 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించి అర్హులకు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎలిగేడు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ మంజూరు కోసం ప్రతిపక్షంలో తాను మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద దీక్షకు కూర్చోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆనాడు ఎన్నికల సమయంలో తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలిగేడు పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లుగా ఇప్పుడు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు మరియు ఎలిగేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్

**-జూన్ 10... పౌర హక్కుల పోరాట యోధుని జయంతి**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాల గోపాల్ కే దక్కుతుంది.బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం- కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్.మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలా కాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలుగా ఉన్న మృణాళిని సోదరి.ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకు డిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు.మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు,ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌర హక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకు డాయన.ఎక్కడ అన్యాయం,వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు.కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయా డని భావించి, మురికి కాల్వల్లో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఏపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్‌సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్‌సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు (ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్) ఆయనను అపహరించి,ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులతో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణ కు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు.సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు.ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించ చాయి. పశ్చిమ బెంగాల్‌లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాల గోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు.అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు,భూసేకరణ, ఆంధ్రప్రదేశ్ లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ-మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాల తో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు.ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు,బహిర్గతం చేశాడు .బాల గోపాల్ దాదా పు ఒక దశాబ్ధం క్రితం న్యాయ శాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు.ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను బైండోవర్ చేసిన రూరల్ పోలీసులు

**చురకలు ప్రతినిధి కరీంనగర్ జూన్ 9 :** శుభం నాగర్లే, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్,ఏ.నిరంజన్ రెడ్డి,ఇన్స్పెక్టర్ కరీంనగర్ రూరల్ ఆదేశానుసారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తమ ట్రాక్టర్స్ నందు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ఓర్సు రాజేందర్,కిన్నెరా చిరంజీవి గూడెం ఎలగందల్ గ్రామం,ఆలకుంట స్వామి బావుపేట్ గ్రామం అనువారలను కొత్తపల్లి యస్.ఐ, మరోకసారి ఇసుక అక్రమ రవాణా మరియు ఎలాంటి చట్ట వ్యతిరేక చర్య చేపట్టకుండా ముందస్తుగా తహసిల్దార్,కొత్తపల్లి ముందు హాజరు పరిచి, లక్ష రూపాయల పూచికత్తు పై బైండ్ ఓవర్ చేయనైనది.ఇకపై కొత్తపల్లి మండల పరిధి లో ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేసిన వ్యక్తులపై ఇంకా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది గతంలో కేసులలో ఉన్నట్లు యితే వారిని రిమాండ్ చేసి, జైలు కు పంపిస్తామని హెచ్చరించడం జరిగింది.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి అడ్లూరి



**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 9 :** నూతనంగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 9 :** గొల్లగుండం తాజా మాజీ సర్పంచ్ సుంక లచ్చయ్య తండ్రి పెద్ద నచ్చయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను సోమవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట మాజీ జడ్పిటీసి రామ్మోహన్ రావు, తాజా మాజీ ఆప్షన్ సభ్యులు అజారుద్దీన్, గొల్లగుండం మాజీ ఉపసర్పంచ్ అన్నపు తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు జంబిరాజు, కొండగట్టు మాజీ డైరెక్టర్ లు పోచమ్మల ప్రవీణ్ కుమార్, జున్ను సురేష్, రియాజ్, గడ్డం మల్లారెడ్డి, వరుణ్ రావు, మనోజ్, చాప మహేష్, రాజేందర్ తదితరులున్నారు.

## ప్రముఖ వైద్యుని హఠాన్మరణం



**చురకలు విలేకరి, జగిత్యాల, జూన్ 9 :** జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, నవీన ఆసుపత్రి నిర్వాహకులు నక్క నారాయణ (58) గుండెపోటుతో మృతి చెందారు. జగిత్యాలలో ఫిజీషియన్ గా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ నారాయణ హఠాన్మరణం స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన ఆకస్మిక మరణం పట్ల పలువురు డాక్టర్లు కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం వెలిబుచ్చారు. గతంలో డాక్టర్ నారాయణ జిల్లాలోని గొల్లపెల్లి మండలం జడ్పిటీసి గా కూడా పని చేశారు. జగిత్యాల పట్టణంలోని సీనియర్ వైద్యుల్లో డాక్టర్ నారాయణ ఒకరు. ఆయన సాధారణ కుటుంబం నుండి వైద్యునిగా ఎదిగారు. ఆయన మరణం పట్ల సన్నిహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా వారికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

# పట్టు వదలని పోరాటం...అందివచ్చిన అవకాశం...

### -జడ్పీటీసీ నుంచి మంత్రిపదవి వరకు అడ్లూరి ప్రస్థానం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 9 :** కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడుగా పలువురి మన్ననలు పొందుతూ తనదైన శైలితో ముందుకు సాగుతూ రాష్ట్ర మంత్రి పదవి సాధించిన అడ్లూరి లక్ష్మన్ కుమార్ ప్రస్థానా న్ని అభినందించక తప్పదు. మాదిగ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి గతం లోని మేడారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా పనిచేస్తున్న సమయంలో ధర్మారం మండలం నుండి జడ్పీటీసీ గా పోటీచేసే అవకాశం లభించడంతో అక్కడ తనకున్న పరిచయస్తులను, నాయకులనుకూడగట్టి ఎన్నికల్లో పోటీచేసి జడ్పీటీసీ గా గెలుపొందారు.గెలిచిందే తడు వుగా కరీంనగర్ జిల్లా పరిషత్ ఎస్సీ రిజర్వుకు కేటాయించడం తో అనూహ్యంగా జెడ్ పి చైర్మన్ పదవి అడ్లూరి లక్ష్మన్ కుమార్ ను వరించింది.తదనంతరం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా పదవి పొంది కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మంచి పట్టు సాధించడం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తర్వాత టి ఆర్ ఎస్,కెసిఆర్ ప్రభుత్వం రావడంతో 10 ఏళ్ళుగా పార్టీ మారకుండా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని గా కొనసాగు తూ ధర్మపురి నియోజకవర్గం పై దృష్టి సారించి ఎమ్మెల్యేగా పలు మార్లు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ పై పోటీచేస్తూ ఓడినా నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉంటూ బి ఆర్ ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధా నాలను ఎండగడుతూ అలుపెరుగని పోరాటం చేసి చివరికి గత ఎన్నికల్లో ధర్మపురి నుండి ఎమ్మెల్యే గా పోటీచేసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వరపై విజయం సాధించారు.అదే సమయంలో కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల్లో విజయడంకా మోగించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం,కష్ట కాలంలో పార్టీ వెన్నంటి ఉంటూ పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం వెంటనే ప్రభుత్వ విప్ గా అడ్లూరిని నియమించింది.ఇదిలావుంటే సామాజికన్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం తో ఎస్సీ మాదిగ వర్గానికి మంత్రి పదవి కేటాయిం చడంతో అనూహ్యంగా అడ్లూరి ని మంత్రి పదవి వరించింది. మొదటినుండి పార్టీకి విధేయుడి గా ఉంటూపనిచేయడం,అలుపె రుగని రాజకీయ పోరాటం నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్టానం ఆయనను గుర్తించ డం తోనే ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టిందని బావించక తప్పదు. పార్టీ ఆదినాయకులకు విధేయుడిగా ప్రజలతోమమేకమై పనిచేయడమే అడ్లూరికి కలిసి వచ్చింది.గతంలో ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ మంత్రిగా కొనసాగగా తిరిగి ఆయనపై గెలిచిన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్ కు మంత్రిపదవి లభించడం తో ధర్మపురి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోనున్నట్లు ప్రజలు బావిస్తున్నారు.

# వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** వర్షాకాలంలో వ్యాధులు ప్రభలగుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దపెల్లి జిల్లా వైద్యాధి కారిని డాక్టర్ అన్న ప్రసన్నకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



**వర్ష కాలములో వచ్చే వ్యాధులు - తీసుకోవాలిసిన జాగ్రత్తలు**

వర్షాకాలం ప్రారంభమగుతు న్నందున ఈ కాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్గి ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవాలని జిల్లా వైధ్య & ఆరోగ్య శాఖాధికారి,పెద్దపల్లి డా. అన్నా ప్రసన్న కుమారి అన్నారు.వర్ష కాలములో వచ్చే వ్యాధులు - జలుబు, మరియు దగ్గు, వైరల్ జ్వరాలు (ఉదా: ఇన్ఫ్లుఎంజా ) టైపాయిడ్ వాంతులు మరియు విరే చనాలు మరియు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు - డెంగ్యూ& మలేరియా.పిల్లలు,వృద్దులు రోగనిరోధక శక్తి తక్కువవున్నవారు,పొలం పనులలో, ఆరు బయట పని చేసే వారికి ఈ వ్యాధులు ఎక్కువగా సోకే అవకాశం కలదు అని స్పష్టం చేశారు.వర్ష కాలంలో తీసుకోవాలిసిన జాగ్రత్తలు : వర్షంలో తడిసినప్పుడు శరీరం చల్లబడి, రక్త నాళాలు కుచించుకోవడం వల్ల ఇమ్యూనిటి (రోగ నిరోధక శక్తి) తగ్గుతుంది. కావున తలను, శరీరాన్ని తుడుచుకోవాలి వెచ్చని ప్రదేశములోకి వెళ్ళాలి అన్నారు.శరీరాన్ని వెచ్చదనము చేసుకోవడమే గాకుండా, వెచ్చ దనాన్ని కల్గించే ద్రవాలు తీసుకోవాలి. టీ, కాఫీలు ఎక్కువగా త్రాగకూడదు, వీటి బదులు మిరియాలు,అల్లం, ధనియాలు, బెల్లం వేసి మరిగించి, గోరు వెచ్చగా చేసుకొన్న నీటిని త్రాగాలి అన్నారు. శీతల పానీయాలైన కూల్ డ్రింక్స్ లాంటివి త్రాగ కూడదు అని పేర్కొన్నారు.చల్లదనాన్ని కల్గించే కూరగాయలు, సొరకాయ, దోసకాయ, బీరకాయ లాంటివి తినడం తగ్గించాలి. ఈ కాలంలో చికెన్ సూప్,బోక్కల చారు, టమోట రసం లాంటివి తీసుకోవాలి, ఎక్కువగా మసాల దినుసులు వేసిన ఆహారాలు, ద్రవాలు తీసుకోవద్దు, అల్సర్లు వచ్చే అవకాశం ఉండును అని అన్నారు.ఈ కాలంలో ఆకుకూరలు ఎక్కువగా దొరుకుతాయి. వీటి ఆకులకు భూమి నుండి క్రిములు సోకె అవకాశము వున్నందున ఉప్పు వేసిన నీటిలో శుభ్రముగా కడుగాలి మరియు మూతపెట్టి బాగా ఉడికిం చాలి.మూత పెట్టక పోయినచో పోషకాలు కోల్పోతాయి మరియు ప్రోటీన్లు ఎక్కువగా వుండే ఆహారం తీసుకోవాలి సూచించారు.వర్షం పడుతుంటే వెంటనే తడవని ప్రాంతానికి వెళ్ళాలి. బయటకు వెళ్ళినపుడు గొడుగు లేదా రెయిన్ కోటు లాంటివి ముందు జాగ్రత్తగా తీసుకెళ్ళాలి. కాచి చల్లార్చిన నీటిని, మిషన్ భగీరథ నీటిని లేదా భూగర్భం నుండి నీరు లభించు బోరు నీటిని త్రాగాలి.బయట తినుబండారాలు తినరాదు.ఈగలు వాలిన ఆహారం భుజించరాదు అని కోరారు.తాజా ఆహారం ను మాత్రమే భుజించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ముఖ్యంగా తినే ముందు మరియు మల విసర్జన తర్వాత చేతులు శుభ్రపరచు కోవాలి అన్నారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుండి రక్షణ కొరకు దోమ తెరలను వాడాలి. కిటికీలకు మరియు దర్వాజలకు మెష్ తలుపులు పెట్టించుకోవాలి. కూలర్ల యందలి నీటిని తొలగించాలి. వాడని రోళ్లను ఇసుక రాళ్లతో నింపాలి. జ్వరం వచ్చిన యెడల దగ్గర లోని ఆరోగ్య కేంద్రం లో సంప్రదించి, తగిన నిర్ధారణ పరీక్షలు చేయించుకొని, చికిత్స తీసుకోవాలి.

**ఆయుర్వేద నిపుణుల సూచనలు:**

వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండ టానికి ఆయుర్వేదం అందించే జీవనశైలి మార్గదర్శకాలు. ఈ సమయంలో వాత దోషం పెరిగే అవకాశం ఉంది కాబట్టి, వెచ్చని, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, మరియు శారీరక శ్రమను తగ్గించడం ద్వారా ఆరోగ్యం కాపాడు కోవచ్చు అన్నారు.వాత దోషంపై నియంత్రణ: వర్షాకాలంలో వాత దోషం పెరగవచ్చు,ఇది కీళ్ల నొప్పులు, ఉబ్బరం, జీర్ణ రుగ్మతలు మరియు ఆందోళన వంటి సమస్యలకు దారితీస్తుంది. శరీరానికి రక్షణ: వర్షాకాలంలో శరీరానికి చలి, నీరు మరియు తేమ నుండి రక్షణ అవసరం.జీర్ణశక్తిని మెరుగుపరచడం: ఈ కాలంలో జీర్ణశక్తి బలహీనంగా ఉండవచ్చు, కాబట్టి తేలికైన ఆహారం తీసుకోవడం ముఖ్య ము.పులుపు, ఉప్పు, మరియు వేడి రుచులు కలిగిన ఆహారం తీసుకోవాలి. గొంగుర,పప్పు, కాయగూరలు మరియు ఇతర రకాల ఆహారం తీసుకోవడం మంచిది. నూనె, మసాలా, మసాలా దినుసులు మరియు ఇతర రకాల ఆహారం తక్కువగా తీసుకోవాలి.గోరువెచ్చని నీరు త్రాగాలి. ఈ సీజన్లో సిద్ధ జలము తాగడం మంచిది. పాత ధాన్యాలతో చేసిన వెచ్చని సూపులను త్రాగండి. పాత ధాన్యాలతో తయారు చేసిన తేలికపాటి మరియు తాజా ఆహారాన్ని తీసుకోండి.ఆహారంలో బియ్యం, జొన్నలు, గోధుమలు, రాగి, పెసలు, అల్లం, వెల్లుల్లి మరియు ఆవు నెయ్యిని చేర్చండి. భోజనానికి ముందు చిన్న అల్లం మరియు రాక్సాల్ట్ ముక్కలు తీసుకోండి. వెచ్చని ఆహారం తీసుకోండి మరియు పచ్చి ఆహారం, తాజా పండ్లు మరియు సలాడ్లను నివారించండి. అదనపు నీరు మరియు ఇతర పానీయాలు తాగకుండా ఉండండి. ఆకు కూరల వాడకాన్ని తగ్గించండి. మొత్తం మటన్ మరియు చికెన్ కు బదులుగా, సూపులను ఇష్టపడండి.వర్ష కాలంలో జీవనశైలి :-వర్షంలో తడవకుండా ఉండండి. పగటిపూట నిద్రపోవడం జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది కాబట్టి దానిని నివారించండి.బట్టలు మరియు పరిసరాలను పొడిగా మరియు శు భ్రంగా ఉంచండి. శరీరాన్ని కూడా పొడిగా ఉంచండి. తడి ప్రాంతాలపై ఫంగల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తాయి. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు వైరల్ ఇన్ఫెక్షన్ కూడా దాడి చేస్తుంది. తేలికపాటి నుండి మితమైన వ్యాయా మం చేయడం మంచిది.వర్ష కాలం లో తిన కూడనివి: ఐస్ క్రీమ్, లస్సీ, పెరుగు, డిసెర్ట్, ఫ్రైడ్ ఐటమ్స్ జంక్ ఫుడ్స్, పగటి నిద్ర చేయడం మంచిది కాదు అని స్పష్టం చేశారు.

# జూన్ 30 వరకు రేషన్ గడువు పొడిగింపు

### -అదనపు కలెక్టర్ డి.వేణు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి)జూన్ 09 :** రేషన్ కార్డుదారు లు తమ రేషన్ తీసుకునేందుకు గడువు జూన్ 30 వరకు పొడిగించడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రజా పంపిణీ బియ్యం జూన్ మాసంలో మూడు నెలలు ఒకేసారి పంపిణీ చేస్తున్నందున గడువు జూన్ 30 వరకు పొడిగించడం జరిగిందని లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందకుండా ఇట్టే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు

### -జూన్ 10...పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి

**రామ కిష్టయ్య సంగన భట్ల...**



మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం.తెలుగుతో పాటు సంస్కృతం,హిందీ, తమిళం,మలయాళం,కన్నడ,గుజరాతీ, మరాఠీ. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచు రించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 - 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు.ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు.దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార,శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు,అనేక అనువాద రచనలు కూడా చేశారు.గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్,ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం,తెలంగాణ తొలితరం కథలు లో 'నౌకరి' కథ వచ్చింది.1945లోనే ఉషస్సు కథలసంపుటిని వెలువరించారు .1945-46లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రము ఖ పాత్ర వహించారు.1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు.